సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం ၊ 2 ၊ జూలై ၊ 2024



వేవేల లాభాల వేప

వేపతో వేల లాభాలు ఉన్నాయి. రైతులకు ఇది ఎంతో ఉపయోగకారి.

- 8లో



శివారుకు సాగునీరిస్తాం..

శివారుకు వంశధార నీరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు అధికారులతో సమీక్షించారు.

- 8లో

వర్సిటీ మెస్ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో మెస్‌ను సోమవారం మధ్యాహ్నం ప్రారంభించారు. గత నెల వర్సిటీ ప్రారంభించగా, మెస్ ప్రారంభించక పోవటం వల్ల క్లాస్‌వర్క్‌పై తీవ్ర ప్రభావం చూపింది. దీనిపై సాక్షిలో కథనం కూడా ప్రచురితమైంది. అయితే మెస్ బకాయిలు చాలా మంది విద్యార్థులు చెల్లించారు. మెస్ ప్రారంభంతో క్లాస్‌లకు విద్యార్థులు వస్తున్నారు.

న్యూస్‌రీల్

ఆ 22 మందికి మళ్లీ నియామకాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో గత ఏడాది జూలైలో అప్పటి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు తొలగించిన 22 మందికి ప్రస్తుత వీసీ కేఆర్ రజిని ఆదేశాల మేరకు, రిజిస్ట్రార్ పి.సుజాత నియామక ఉత్తర్వులు జారీచేశారు. 21 మందికి సోమవారం ఉత్తర్వులు అందించారు. ఒకరికి గత నెల 20వ తేదీన ఉత్తర్వులు అందించారు. కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా వీరిని తొలగించిన డిజిగ్నేషన్‌తోనే మళ్లీ నియమించారు. గెస్ట్ ఫ్యాకల్టీగా 21 మందిని గత నెల 20వ తేదీన నియమించగా, వీరు ఉత్తర్వులు తీసుకునేందుకు నిరాకరించారు. ప్రస్తుతం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలు ఇస్తుండటంతో ఉత్తర్వులు తీసుకుంటున్నారు. కొందరు తీసుకోగా.. ఇంకొందరు తీసుకోవాల్సి ఉంది.

డీవీఈఓ బాధ్యతల స్వీకరణ



డీవీఈఓ
ఎస్.తవిటినాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా ఇంటర్మీడియెట్ విద్య వృత్తి విద్యాశాఖాధికారి(డీవీఈఓ)గా శివ్వాల తవిటినాయుడు సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ డీవీఈఓగా పనిచేసిన కోట ప్రకాశరావు ఆదివారం పదవీవిరమణ చేయడంతో.. అతని స్థానంలో తవిటినాయుడుకి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ నిధిమీనా ఉత్తర్వులు జారీసిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన డీవీఈఓ తవిటినాయుడును ఆర్ఐఓ పి.దుర్గారావు, సీనియర్ ప్రిన్సిపాల్స్ అప్పలరాము, శ్యామ్‌సుందర్, పీఈ సత్యన్నారాయణ పట్నాయక్, భూషణరావు, కృష్ణవేణి, కె.తవిటినాయుడు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ వావిలపల్లి నారాయణస్వామి, జేఎల్స్ అసోసియేషన్ నాయకులు, కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం ప్రతినిధులు, గెస్ట్ లెక్చరర్ల సంఘ ప్రతినిధులు కలిసి అభినందించారు.

'పర్యవేక్షణ అవసరం'

టెక్కలి రూరల్: తరగతి గదిలో విద్యార్థికి ఉపాధ్యాయులు బోధించే అంశాలపై ప్రధానోపాధ్యాయులు, ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ అవసరమని సమగ్రశిక్షా అభియాన్ జిల్లా అధికారి గోవిందరావు అన్నారు. సాఫ్ట్ ఆంధ్రా లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్(సాల్ట్) శిక్షణ శిబిరాన్ని స్థానిక బాలికోన్నత పాఠశాలలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధనలో బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. మెరుగైన బోధనకు ఉపాధ్యాయులు ఉన్న వనరుల్ని వినియోగించుకోవాలన్నారు. ఈ శిక్షణ శిబిరం 9రోజులు పాటు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు దల్లి తులసిరావు రెడ్డి, దాసుపురం చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈఏపీసెట్–2024 ఎంపీసీ స్ట్రీమ్ కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమైంది. ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ నెల 7వ తేదీ వరకు ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. నాల్గో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి. షెడ్యూల్ మేరకు కౌన్సెలింగ్ కొనసాగుతుందని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి.దామోదర్ రావు తెలిపారు. సాంకేతిక ఇబ్బందులు ఉంటే సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

డీఎస్సీకి ఉచిత శిక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించిన డీఎస్సీ పరీక్షలకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఈ నెల 5వ తేదీ లోగా నేరుగా బీసీ స్టడీ సర్కిల్‌కు అందజేయాలని బీసీ సంక్షేమాధికారి ఇ.అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, ఆసక్తి గల వారు శ్రీకాకుళం నగరంలోని 80 ఫీట్ రోడ్డులోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. శిక్షణ తరగతులు ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలోని గిరిజన్ భవన్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన 200 మంది (బీసీ 66శాతం, ఎస్సీలు 20 శాతం, ఎస్టీలు 14 శాతం)ని ఎంపిక చేసి 60 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో 75శాతం హాజరు కలిగిన అభ్యర్థులకు స్టైఫండ్ రూ. 1500, బుక్స్ అలవెన్సు రూ.1000 అందజేయడం జరుగునని తెలిపారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్, కుల, రేషన్ కార్డు/ ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, క్వాలిఫికేషన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా దరఖాస్తుతో జతచేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు స్టడీ సర్కిల్ నంబర్లు 7382975679, 9295653489, 8332852106 ను సంప్రదించాలని కోరారు.

పింఛన్ల పంపిణీలో రాజకీయ పెత్తనం

కొత్త ప్రభుత్వం ఆధ్వర్యంలో తొలిరోజు పెన్షన్లు అందించిన కార్యక్రమం ఆద్యంతం అధికార కూటమి నేతల ఆర్భాటం..

గత నాలుగున్నరేళ్లు వలంటీర్లు చేసిన పనిని తమ మీద రుద్దినా.. కిమ్మనకుండా ఉదయం ఐదు గంటల నుంచే వీధుల్లోకి వచ్చిన సచివాలయం సిబ్బందిపై కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు పలుచోట్ల రుబాబు చేయడం కనిపించింది. అనుకున్న సమయానికే పెన్షన్లు ఇచ్చేందుకు సిబ్బంది వచ్చినా.. నేతలు మాత్రం తీరిగ్గా రావడం, ఫొటోలకే ఆరాటపడటంతో చాలాచోట్ల పంపిణీ ప్రక్రియలో ఆలస్యం జరిగింది. కొన్నిచోట్ల సచివాలయం సిబ్బందిపై టీడీపీ నేతలు నోటీదురుసుతనం చూపించగా.. కవిటి మండలం లండారిపుట్టుగ టీడీపీకి చెందిన సర్పంచ్ భర్త ఏకంగా సచివాలయం ఉద్యోగిపై చేయి చేసుకున్నారు. కాశీబుగ్గలో ఓ లబ్ధిదారుడిని ఏడిపించి పింఛన్ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎటువంటి రాజకీయ ప్రమేయం లేకుండా వలంటీర్లే పింఛన్ల పంపిణీని చకచకా చేసుకుపోయిన విషయాన్ని చాలాచోట్ల లబ్ధిదారులు గుర్తుచేసుకున్నారు.



పెదంచల రైతు భరోసా కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న పింఛన్‌దారులు

పెదంచలలో నిరసన

కాశీబుగ్గ: పలాస మండలం పెదంచల గ్రామంలో సోమవారం అందించాల్సిన ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను కొందరికి నిలిపివేయడం కలకలం రేపింది. తెలుగుదేశం నాయకుల ఫిర్యాదు మేరకు ఇవ్వలేక పోతున్నామని సచివాలయ సిబ్బంది చెప్పడంతో లబ్ధిదారులు నివ్వెరపోయారు. తొలుత పెదంచల సచివాలయానికి తాళం వేసి అనంతరం రైతు భరోసా కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. డబ్బై మందిలో 22 మంది వైఎస్సార్‌సానుభూతి పరులంటూ పింఛన్లు ఇవ్వలేదు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాయంత్రం 3 గంటలకు వారికి పింఛన్లు అందజేశారు.

- పలు చోట్ల సచివాలయ ఉద్యోగులపై టీడీపీ కార్యకర్తల చిందులు
- తొలిరోజు రాత్రి ఏడింటికి 96.57 శాతం పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: కొత్త ప్రభుత్వం ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ తొలిరోజు సోమవారం జిల్లా వ్యాప్తంగా జరిగింది. ముందుగా చెప్పినట్లు పెంచిన పింఛన్‌తో పాటు రూ.3000 కలిపి రూ.7వేలు అందజేశారు. అయితే అక్కడక్కడా టీడీపీ నాయకులు సచివాలయ ఉద్యోగులపై చిందులు తొక్కడం కనిపించింది. వలంటీర్ల సాయం తీసుకోకుండా సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగానే ఉద్యోగులకు వారు పంపిణీ చేయాల్సిన పింఛన్‌దారుల వివరాలను అందజేశారు. ఉదయం ఆరు గంటలకే సచివాలయ ఉద్యోగులు గ్రామాలకు చేరారు. అయితే టీడీపీ కార్యకర్తలు వచ్చి, సందేశం ఇచ్చిన తర్వాత మాత్రమే పంపిణీ కార్యక్రమం మొదలు పెట్టాలని ఆదేశించడంతో వారికి ఇబ్బందులు తప్పలేదు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు ఉన్న చోట్ల టీడీపీ నాయకులు ఉద్యోగులపై వీరంగం వేశారు. సర్పంచ్ ఉన్న చోట నుంచి కాకుండా టీడీపీ నాయకులు ఉన్న చోట నుంచి పంపిణీ ప్రారంభించాలని హుకుం జారీ చేశారు. కొన్ని చోట్ల పింఛను మంజూరైన వారికి కూడా పింఛను ఇవ్వనీయకుండా అడ్డుకున్నారు. తర్వాత మండల స్థాయి అధికారులు వచ్చి సర్దుబాటు చేశారు. పింఛన్ల పంపిణీలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ శ్రీకాకుళం రూరల్ మండలంలో పలు చోట్లు పాల్గొన్నారు. తొలిరోజు రాత్రి ఏడు గంటల సమయానికి 96.57 శాతం మందికి పింఛన్లు అందజేశారు. జిల్లాలో ఈ నెలకు సంబంధించి 3,19,147 పింఛన్లు విడుదల కాగా వీటిలో సాయంత్రం వరకు 3,08,215 మంది లబ్ధిదారులకు నగదు అందజేశారు.

చాకిపల్లిలో ఆందోళన

టెక్కలి: టెక్కలి మండలం చాకిపల్లి గ్రామంలో పలువురు పింఛన్‌దారులకు పింఛన్ నిలిపివేయడంతో ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీలో భాగంగా సుమారు 15 మందికి పింఛన్ డబ్బులు ఇవ్వలేదు. ఇందులో దళితులతో పాటు ఇతర వర్గాలకు చెందిన నిరుపేదలు ఉన్నారు. తక్షణమే అధికారులు స్పందించి పింఛన్ డబ్బులు అందజేయాలని వారంతా కోరుతున్నారు.

మాట నిలబెట్టుకున్నాం



కోటబొమ్మాళి మండలం వాండ్రాడలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను లబ్ధిదారునికి పంపిణీ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: పేదల సంక్షేమమే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయమని, అందుకే ఎన్నికల ముందు అన్ని కేటగిరీల పింఛన్లను పెంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం కోటబొమ్మాళి మండలం వాండ్రాడ, తర్లిపేట పంచాయతీల్లో రవాణ శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్‌రెడ్డితో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంత్రి అచ్చెన్నాయుడు లబ్ధిదారులకు అందజేశారు. పెంచిన పింఛన్ల మొత్తాన్ని సచివాలయ సిబ్బందితో అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కింజరాపు హరివరప్రసాద్, బోయిన రమేష్, వెలమల విజయలక్ష్మి, చల్ల శ్రీనివాసరావు, వెలమల కామేశ్వరరావు, పూజారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

'వందశాతం పింఛన్ల పంపిణీ పూర్తి కావాలి'



జేఆర్ పురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

రణస్థలం: జిల్లా వ్యాప్తంగా ఉన్న 3,19,119 మంది పింఛన్ లబ్ధిదారులందరికీ పింఛన్లు పంపిణీ చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. మండలంలోని జేఆర్ పురం పంచాయతీలో గల గౌడవీధిలో సోమవారం ఆయన స్వయంగా అర్హులైన వారికి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ము అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్. రామారావు, మాజీ ఎంపీపీ డీజీయం ఆనందరావు, కూటమి నాయకులు ఉన్నారు.

ధవళపేట పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జి.సిగడాం: మండలంలోని ధవళపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వాతిపై సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, ఉపసర్పంచ్ పేడాడ శ్రీనివాసరావు కలిసి సోమవారం కలెక్టర్‌కు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న సామాజిక పింఛన్లను తమకు సంబంధం లేకుండా కొంతమంది వ్యక్తులతో పంపిణీ చేశారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్నామని, తమకు తెలియకుండా పంపిణీ చేశారని ఆరోపించారు. తక్షణమే సంబంధిత కార్యదర్శిపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



సోంపేట: కొర్లాంలో మండపం వద్ద పింఛన్లు అందజేస్తున్న కూటమి నాయకులు



యాప్ పనిచేయక పంచాయతీ కార్యాలయం వద్ద ఇబ్బందులు పడుతున్న సచివాలయ సిబ్బంది



ఇచ్ఛాపురం రూరల్: తులసిగాంలో పింఛన్ కోసం మండపం వద్ద లబ్ధిదారుల అవస్థలు

తొలి రోజు ఇలా..

ఊరూరా ఎమ్మెల్యేలు, మంత్రుల హడావుడి. వీధివీధినా సచివాలయ ఉద్యోగుల సందడితో పింఛన్ల పంపిణీ మొదలైంది. కానీ ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. నాణేనికి మరోవైపు కూడా ఉంది. వాస్తవానికి ఇంటికే పింఛన్ అన్నారు.. కానీ చాలా ఊళ్లలో మండపాల వద్దే పని కానిచ్చేశారు. వలంటీర్ వ్యవస్థతో అనుసంధానమైపోయిన వృద్ధులు, దివ్యాంగులు ఈ నెల మాత్రం తమ వద్దకు ఎవరు వస్తారో.. ఎవరికి అడగాలో తెలీక ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూసిన ఘటనలు ఇచ్ఛాపురంలో కనిపించాయి. సర్వర్లు కూడా డౌన్ కావడంతో పింఛన్‌దారుల ఇళ్లు కనుక్కోలేక ఈదుపురంలో సచివాలయ సిబ్బంది నానా యాతన పడ్డారు. నరసన్నపేటలో పలుచోట్ల నడివీధిలోనే నగదు పంపిణీ జరిగింది. వజ్రపుకొత్తూరులోని పలు గ్రామాల్లో కూడా సాంకేతిక సమస్యలు, సిగ్నల్ సమస్యలు తప్పలేదు.

'మీ కోసం'లో 204 అర్జీల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, జేసీ నవీన్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. మీ కోసం కార్యక్రమం సోమవారం జెడ్పీ సమావేశం మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వినతులు స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ రామ్మోహన్ రావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు ఉన్నారు. కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ దరఖాస్తులను నిర్దేశించిన సమయంలో పరిష్కరించాలన్నారు. పరిష్కారానికి సంబంధించిన అర్జీని వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. న్యాయ సంబంధమైన సమస్యల అర్జీలను పరిష్కరించడంలో అధికారులు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్ మెంట్ ఇవ్వాలని తెలిపారు. ఈ వారం మొత్తం 204 అర్జీలు స్వీకరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్స్‌కి కలెక్టర్ గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో కేఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ దొరబాబు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకట్రామన్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.మీనాక్షి, డ్వామా పీడీ చిట్టి రాజు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఈ రాంబాబు, జిల్లా ఉద్యాన అధికారి ఆర్‌వీ ప్రసాద రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గొట్టా బ్యారేజీ నీటి విడుదల



సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు

హిరమండలం: ఖరీఫ్‌లో శివారు ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఆయన సోమవారం గొట్టా బ్యారేజీ నుంచి కుడి, ఎడమ ప్రధాన కాలువలోకి నీరు విడుదల చేశారు. ముందుగా గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గేట్లు ఎత్తివేసి నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాను సస్యశ్యామలం చేస్తున్న గొట్టా బ్యారేజీ పాతపట్నం నియోజకవర్గంలో ఉండడం ఆనందించదగ్గ విషయమన్నారు. వంశధార అధికారులు మాట్లాడుతూ ఈ ఏడాది అనుకున్న సమయంలో వర్షాలు పడలేదన్నారు. ఇటీవల వారం రోజులుగా పడిన వర్షాలకు వచ్చిన నీటిని బ్యారేజీలో నిల్వ ఉంచామన్నారు. ప్రస్తుతం 37.8 మీటర్ల నీటిమట్టం ఉందని చెప్పారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 700 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువకు వంద క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టినట్లు తెలిపారు. క్రమేపీ క్యూసెక్కులు పెంచుతామని పేర్కొన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో శివారు ఆయకట్టుకూ నీరందేలా చర్యలు చేపట్టనున్నట్టు చెప్పారు. రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వంశధార కట్టడాల విభాగం ఈఈ ఎంవీ రమణ, డీఈఈలు రంగనాయక్ అనిల్‌కుమార్ ధనుంజయరావు, ఏఈ పరిశుద్ధబాబు, సత్యనారాయణ, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే డెంగీ నియంత్రణ

- దోమల వ్యాప్తి నివారణకు ప్రత్యేక డ్రైవ్
- డెంగీ వ్యతిరేక మాసోత్సవాల ప్రారంభోత్సవంలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



వైఎస్సార్ కూడలి వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి తదితరులు

అరసవల్లి: డెంగీ వ్యాధి నివారణకు దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సూచించారు. డెంగీ వ్యాధి వ్యతిరేక మాసోత్సవాలను సోమవారం ఉదయం స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయం వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ నెల 1 నుంచి 31 వరకు జరగనున్న ఈ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమ ప్రారంభ ర్యాలీలో పాల్గొని ఆయన మాట్లాడారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతోనే డెంగీ నివారణ సాధ్యమన్నారు. దోమకాటు ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తున్నందున ముందుగా మన పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. మురుగునీటి నిల్వలున్న ప్రాంతాలను అత్యంత ప్రాధాన్యతగా గుర్తించి దోమల నిల్వలను నియంత్రించే మందులను పిచికారీ చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంటిలోనూ దోమ తెరలు వాడాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని ఆదేశించారు. మంచినీటి ట్యాంకులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి మాట్లాడుతూ డెంగీ జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ దోమల నియంత్రణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని, మురుగునీటి నిల్వలున్న చోట దోమలు ఉత్పత్తి అవుతున్నాయని, ప్రజలు అవగాహనతో దోమల నిల్వలుండకుండా చర్యలు చేపట్టాలన్నారు.



నినాదాలతో ర్యాలీ

డెంగీ నియంత్రణ లక్ష్యంగా ఈ నెల 1 నుంచి 31 వరకు జరగనున్న మాసోత్సవాల ర్యాలీని స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు నిర్వహించారు. కలెక్టర్ ఈ ర్యాలీని ప్రారంభించగా, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు, మలేరియా నివారణ విభాగ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులంతా దోమల నివారణ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మీనాక్షి, మలేరియా నియంత్రణ అధికారి సత్యనారాయణ, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శ్రీదేవి, డీపీఎంఓ జీవీ లక్ష్మి, మున్సిపల్ హెల్తాఫీసర్ ఎం.వెంకట్రావు, మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమడి గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఆందోళన



పెద్దమడి గురుకుల పాఠశాల వద్ద నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

మెళియాపుట్టి: మండలంలోని పెద్దమడి గురుకుల పాఠశాలలో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పాఠశాలలో మొత్తం 398 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే ప్రస్తుతం ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ మాత్రమే ఉండటంతో పాఠశాలలో తరగతుల నిర్వహణ ఆగిపోయింది. దానికి కారణం అక్కడ పనిచేస్తున్న పొరుగుసేవల (ఔట్ సోర్సింగ్) ఉపాధ్యాయులే. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో 17 మంది కూడా ఔట్‌సోర్సింగ్ వారే.. ఇటీవల విడుదలైన డీఎస్సీ నోటిఫికేషన్‌లో వారిని కూడా చేర్చడంతో వారు విధులకు హాజరు కాకుండా పెన్‌డౌన్ ప్రకటించి నిరసన బాట పట్టారు. దీంతో తరగతుల నిర్వహణ ఆగిపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తరగతులు జరగాల్సిన సమయంలో ఉపాధ్యాయులు పాఠశాలకు రాకపోవడంతో విద్యార్థులకు ఎదురుచూపులు తప్పలేదు. వెంటనే అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులు సైతం పాఠశాల ఎదుట నిరసన తెలిపారు.

క్లుప్తంగా

ఓఎస్డీగా కావ్యజ్యోత్స్న నియామకం



కావ్యజ్యోత్స్నకు ఓఎస్డీ నియామక పత్రం అందజేస్తున్న వీసీ రజని, రిజిస్ట్రార్ సుజాత

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సోషల్ వర్క్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న యు.కావ్యజ్యోత్స్నను ఓఎస్డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)గా నియమించి సోమవారం ఉత్తర్వులు అందజేశారు. ఉత్తర్వులను వీసీ కేఆర్ రజని, రిజిస్ట్రార్ పి.సుజాత అందజేశారు. వర్సిటీ పాలనలో అందరినీ భాగస్వాములు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఆదిత్యుని సన్నిధిలో ఎన్నికల వ్యయపరిశీలకులు



ఐఆర్ఎస్ అధికారులకు ఆదిత్యుని జ్ఞాపికలను అందజేస్తున్న చక్రవర్తి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని కేంద్ర ఎన్నికల వ్యయపరిశీలకులు, పర్యవేక్షణాధికారులు, ఐఆర్ఎస్ అధికారులు సౌమ్య పాండే జైన్, అక్ష జైన్, సౌమ్య చౌదరిలు సోమవారం ఉదయం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ అర్చకులు ఇప్పిలి క్షేమేంద్ర శర్మ ఆలయ విశిష్టతను వారికి వివరించారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న భూమి కౌలుకు వేలం

టెక్కలి: టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానానికి చెందిన భూమి కౌలుకు సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. సర్వే నంబర్ 142/6 లో 3.46 సెంట్లు, 143/9 లో 1.53 సెంట్లు కలిపి మొత్తం 4.99 సెంట్లు భూమికి సంబంధించి మూడేళ్ల కాల పరిమితికి కౌలుకు తీసుకోవడానికి బహిరంగ వేలం నిర్వహించారు. ఈఓలు వి.రాధాకృష్ణ, టి.రవి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ బహిరంగ వేలంలో ఏడాదికి రూ.86,100 చొప్పున దాసరి లక్ష్మణరావు పాటను కైవసం చేసుకున్నారు.

3న బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నిక

శ్రీకాకుళం అర్బన్: బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నిక ఈనెల 3వ తేదీన జరగనుందని ఏపీ ఎన్జీఓ సంఘ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఎన్నికల అధికారి ఆర్.గోవింద పట్నాయక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎన్నికలు శ్రీకాకుళంలోని ఏపీ ఎన్జీఓ సంఘ కార్యాలయంలో ఈనెల 3వ తేదీన ఉదయం 10.30 గంటలకు జరగనున్నట్లు తెలిపారు.

అగ్నిప్రమాదంలో మూగజీవాలు బలి



నెలవంక అగ్ని ప్రమాదంలో కాలిన మేకలపెంపకం దొడ్డి

కవిటి: మండలంలోని నెలవంకలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. గ్రామానికి చెందిన దుర్గాశి శ్యామల అనే మేకల పెంపకందారుకు చెందిన మూగజీవాలు ఈ అగ్నిప్రమాదంలో మృత్యువాత పడినట్లు స్థానికులు చెబుతున్నారు. వీటి విలువ రూ.1.5లక్షలుగా ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. ప్రమాదం ఎలా జరిగిందన్న విషయం స్పష్టమైన కారణం తెలిసిరాలేదు.

రాజీనామా చేయాల్సిందే అంటూ..

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ కేఆర్ రజనిపై విద్యాశాఖ మంత్రి లోకేష్ కార్యాలయం నుంచి రాజీనామా చేయాలని తీవ్ర ఒత్తిడి వస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే గత నెల 29తేదీ డెడ్‌లైన్ విధించారు. ప్రస్తుతం మాత్రం ఆమె కొనసాగుతున్నారు. ఒక కీలక మంత్రిని ఆమె కలిసి కొనసాగించాలని కోరినట్లు సమాచారం. మంత్రి మాత్రం మీకు లోకేష్ కార్యాలయం నుంచి ఫోన్ వచ్చిందా అని అడగగా. వచ్చినట్లు చెప్పినట్లు సమాచారం. దీంతో ఆయన సైతం తన పరిధిలో లేదని తప్పించుకున్నట్లు తెలుస్తుంది. మరో పక్క పాలసీ మేటర్ మేరకు అందరు వీసీలు రాజీనామా చేస్తారని టీడీపీ నాయకులు అంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ముగ్గురు మాత్రమే కొనసాగుతున్నారు. మిగతా అందరూ రాజీనామా చేశారు. ప్రస్తుతం వర్సిటీలో వీసీ కొనసాగుతారా?లేదా? అన్న అంశం చర్చనీయాంశంగా మారింది.

వేవేల లాభాల వేప

- పంట సాగులో వేప ఉత్పత్తుల వినియోగం
- తెగుళ్ల నివారణలో కీలక పాత్ర
- వేపతో 300 కీటకాలు నాశనం
- రసాయన ఎరువులు, పురుగు మందులు తగ్గిస్తే మేలు



వేప కాయలు



ముడి సరుకు లభించే వేప చెట్టు

వజ్రపుకొత్తూరు: రైతులకు వేప ఉత్పత్తులు సాగులో సాయం చేస్తున్నాయి. వేప చెట్టులో వేరు మొదలు బెరడు, ఆకులు, పువ్వులు, పండ్లు, విత్తనాలు ఇలా సమస్తం ఔషధ గుణాలతో నిండి ఉంటాయి. వీటిని వినియోగించడం వల్ల పంటకు బలం చేకూరడమే కాకుండా.. భూమికి కూడా సత్తువ కలుగుతుంది. రసాయన ఎరువులు వినియోగించడం వల్ల ఫలసాయంతో పాటు భూసారం కూడా తగ్గుతుంది.

తెగుళ్ల నివారణ ఇలా...

వివిధ పంటల్లో వేప మందుల వాడకంతో పలు రకాల చీడపీడలను నివారించవచ్చు. వరి పంటకు ఎకరాకు 150 నుంచి 200 కిలోల వేప పిండిని దమ్ములో వేయడం ద్వారా కాండం తొలిచే పురుగు, ఉల్లి కోడును అదుపు చేయవచ్చు. వరి పైరుపై లీటరు నీటికి 3 మిల్లీలీటర్ల చొప్పున కలిపిన ఆ ద్రావణాన్ని ఎకరాకు 200 లీటర్లు పిచికారీ చేస్తే అగ్గి తెగులు, తొడిమి కుళ్లు, పొడతెగులు, వరి తుంగ్రో వైరస్ తెగుళ్లను అదుపు చేసుకోవచ్చు. 5శాతం వేప గింజల కషాయం ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని మిర్చి పైరుపై పిచికారీ చేస్తే తెల్లదోమను అరికట్టవచ్చు. మిర్చి మీద వచ్చే జెమిని వైరస్ కూడా అదుపులో ఉంటుంది. వేరుశనగపైరును ఆశించి ఎక్కువగా నష్టపరిచే తిక్కా ఆకుపచ్చ తెగులు, టమాటో సాగులో ఎండు తెగులును వేప నూనెతో నివారించవచ్చు.

ఇంటిలోనే కషాయం తయారీ

పంటకు అవసరమైన వేప కషాయాన్ని ఇంటిలోని మహిళలే తయారు చేసుకోవచ్చు. ఐదు కిలోల వేప గింజలు నలగ్గొట్టి, 6 నుంచి 7 లీటర్ల నీటిలో ఒకటి నుంచి రెండు రోజులు నానబెట్టాలి. దీన్ని వస్త్రంలో పోసి వడకట్టాలి. మరో 100 లీటర్ల నీటిని అందులో కలిపి వినియోగించాలి.

వేపతో 300 రకాల కీటకాలు నాశనం

వేపలో అజాడిరాక్టిన్ అనే పదార్థం ఉంటుంది. దీనికి 300 రకాల కీటకాలు,నల్లి జాతి పురుగులు, చెదలు, భూమిలోని నెమతోడ్స్, కొన్ని రకాల బూజు శిలీంద్రాలను అరికట్టే శక్తి ఉంటుంది. వరి, పత్తి, అపరాలు, కూరగాయలు, పండ్ల మొక్కలు, కాఫీ, జొన్న, ఉద్యాన పంటలను ఆశించే కీటకాలను వేప అరికడుతుంది. మార్కెట్‌లో వేప పిండి, వేప నూనె, వేప కషాయం ఇలా వివిధ రకాల వేప ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.

కీటకాల నివారణే కీలకం

నీమ్ ఆయిల్‌ను స్థానిక వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు వినియోగిస్తే కీటకాలను నివారించవచ్చు. ఈ మందు స్ప్రే చేసినపుడు పురుగులకు వికారం కలిగించి పైరును నాశనం చేయకుండా చేస్తుంది. ఈ మందు పక్షులు, మానవులు, మిత్రపురుగుల, తేనెటీగలు వంటి జీవ రాశులకు హాని చేయదు. సమగ్ర సస్యరక్షణ విధానంలో వేప మందులు బాగా ఉపయుక్తమవుతాయి. పురుగుల మందులు, శిలీంద్ర నాశినులతో వేపను కలిపి సురక్షితంగా స్ప్రే చేసుకోవచ్చు.

ఇదే అనుకూల సమయం

పైరుపై పురుగు ఆశించిన వెంటనే వేప మందు స్ప్రే చేయాలి. తల్లిపురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన వెంటనే చేస్తే ఇంకా మంచిది. ఎకరాకు 3 నుంచి 5 మిల్లీలీటర్ల నీమ్ ఆయిల్‌ను లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలి. వాతావరణం చల్లగా ఉన్న సమయంలో (ఉదయం, సాయంత్రం) పిచికారీ చేయాలి. 7 నుంచి 15 రోజుల వ్యవధిలో ఈ పని పూర్తి చేయాలి. పిచికారీ చేసిన తర్వాత 6 గంటల వ్యవధిలో వర్షం పడితే మళ్లీ పిచికారీ చేయాల్సిందే.

రైతులు వినియోగిస్తే మంచి ఫలితాలు



ఉద్యానవన పంటల్లోనే కాకుండా వరి సాగులో వేప పిండి, నూనె తదితర ఉత్పత్తులు అధికారుల సూచనలతో వాడితే మంచి ఫలితాలు వస్తాయి. నేను కూరగాయలు, కొబ్బరి సాగులో వినియోగించాను. ఆశించిన మేర ఫలితాలు వచ్చాయి. ఐతే కొంచెం ధర ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల సూచన పాటించి వాడాలి. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు వేప పిండి, సంబంధిత ఉత్పత్తులు సబ్సిడీలపై అందిస్తే సేంద్రియ వ్యవసాయం వైపు వెళ్లేందుకు అవకాశం కలుగుతుంది.

– కె.గిరిబాబు, రైతు అమలపాడు

వేప మంచి కీటక నాశిని



వేప వరి పైరులో మంచి కీటక నాశిని. ఐతే మన ప్రాంతంలో వాస్తవానికి అధికంగా రసాయన ఎరువులను రైతులు వినియోగిస్తున్నారు. వేప ఉత్పత్తులను వినియోగించి సాగు చేస్తే చాలా మంచి ఫలితాలు ఉంటాయి. ఐతే వాటి ఉత్పత్తుల ధరలు చూస్తే చాలా ఎక్కువగా ఉంటాయి. నూనె తీయగా మిగిలిన వేప చెక్క ఎండిన వేప ఆకులు, కాయలను దంచగా వచ్చే పిండిని వరి దమ్ములో వినియోగిస్తే ఎంతో మంచిది. ప్రస్తుతం వేప ఉత్పత్తులకు వ్యవసాయ శాఖ నుంచి ఎలాంటి సబ్సిడీ లేదు.

– ఎల్‌వీ మధు, ఏడీఏ, వ్యసాయ శాఖ, పలాస

శివారుకు సాగునీరిస్తాం: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వంశధార నీటిని వజ్రపుకొత్తూరులోని శివారు భూములకు అందించడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా పూర్తిస్థాయిలో పూడిక తీత, తుప్పల తొలగింపు పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ అధికారులతో కలిసి ఎంపీడీఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది కాలువ భూములకూ సాగునీరు అందించాలనే లక్ష్యంలో భాగంగానే వంశధార రిజర్వాయర్ నుంచి సోమవారం నీటిని విడుదల చేశామని చెప్పారు. షట్టర్ల సమస్యలు ఉన్న చోట్ల ఇసుక బస్తాలతో తాత్కాలికంగా అడ్డుకట్ట వేశామని, మంగళవారం మధ్యాహ్నానికి పలాస జగన్నాథ సాగరం వరకూ నీటిని తీసుకువెళ్తామని వంశధార ఇంజినీరింగ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రానున్న వారం రోజులూ వంశధార కాలువలు, ఇతర ఇరిగేషన్ కాలువలపై పూర్తిస్థాయిలో పనులు జరగాలని, వీటికి ఉపాధి హామీ పథకం కింద గ్రాంటు మంజూరు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ కింద ఖర్చు పెట్టే అవకాశం ఉన్న పనులను ఆయా ప్రజా ప్రతినిధులతో కలిసి గుర్తించాలని సూచించారు. ఆయా గ్రామాలకు సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, ఇతర శాశ్వత ప్రయోజనం కలిగే పనులను గుర్తించి వెంటనే ప్రతిపాదనలు అందజేయాలని, రానున్న వారం రోజుల్లోపు పంచాయతీరాజ్ ఎస్ఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈలు తమ సిబ్బందితో అంచనాలను రూపొందించాలని అన్నారు. పనులు జరగకుండా బిల్లులు చేసినా, ఉపాధి పనుల్లో మస్టర్ విషయంలో అవకతవకలు జరిగినా ఆయా సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఒకటో తేదీనే పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఒక్క రోజులోనే 97 శాతం లక్ష్యాన్ని సాధించగలగామని, ఈ విషయంలో రాష్ట్రంలో నంబర్ వన్ స్థానంలో ఉన్నామని కలెక్టర్ ఈ సందర్భంగా ఎంపీడీఓలను అభినందించారు.

సమావేశంలో డ్వామా పీడీ చిట్టి రాజు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ఆర్ వెంకట్రామన్, వంశధార ఈఈ శేఖర్, ఉద్యానవన శాఖాధికారి ప్రసాద్, ఆయా మండలాల ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

దాడులు, అక్రమ కేసులను
సమష్టిగా ఎదుర్కొందాం

- వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ఆమదాలవలస నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు చేస్తున్న దాడులు, బనాయిస్తున్న కేసులు అక్రమమని, వాటిని సమష్టిగా ఎదుర్కొంటామని వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలసలో గల జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతో నియోజకవర్గంలో గల 4 మండలాల్లోని అనేక గ్రామాల్లో టీడీపీ నాయకులు దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులపై ఉద్దేశపూర్వకంగా అక్రమ కేసులు పెట్టించి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు కూడా బనాయిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో గెలుపు–ఓటములు సహజమని, అది తెలుసుకోకుండా ఇలా విర్రవీగడం సరికాదన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన కూన రవికుమార్ ఇలాంటి దాడులను ప్రోత్సహించకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేర్చాలని సూచించారు.

ఫలితాలపై ఎవరూ నిరాశ పడాల్సిన అవసరం లేదని, 2019లో టీడీపీ ఓడిపోయిన సందర్భంలో వచ్చిన ఓట్ల కన్నా ఇప్పుడు మనకు వచ్చిన ఓట్ల శాతం ఎక్కువేనని, మళ్లీ పుంజుకుంటామని తెలిపారు. సమావేశంలో శ్రీకాకుళం జిల్లా ప్రచార విభాగం ఉపాధ్యక్షుడు కొప్పల ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అన్నెపు కృష్ణ, పోతిన రమేష్, చింతాడ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఏయూ ముందు ధర్నా



ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ముందు జిల్లా దళిత సంఘాలు సోమవారం ధర్నా నిర్వహించాయి. ఎచ్చెర్లలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి పాత జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి, వర్సిటీ ముందు ధర్నా చేశారు. ముందస్తుగా ఎచ్చెర్ల ఎస్ఐ ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలోని పోలీసులు ప్రధాన గేటు వద్ద భద్రత ఏర్పాటు చేశారు. గేట్లు మూసివేసి, లోపలకు వెళ్లకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రధాన గేటు ముందు దళిత సంఘాల ప్రతినిధులు ధర్నా నిర్వహించి, నినాదాలు చేశారు. వర్సిటీలో రూలాఫ్ రిజర్వేషన్ అమలు చేయాలని, పూర్వపు వీసీ నిమ్మ వెంకటరావు నియామకాలు, అవినీతిపై విచారణ జరిపించాలని, 34 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించాలని,



ప్రధాన గేటు మూసి పోలీసుల భద్రత

అవినీతిలో భాగస్వామి అయిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయిబాబాను తొలగించాలని, అంబేడ్కర్ చైర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో దళిత సంఘాల నాయకులు దుర్గాసి గణేష్, టొంపాల రమణ, బెలమర ప్రభాకర్, బోనెల అప్పారావు, వన్నాళి లక్ష్మీనారాయణ, తండ్యాన లక్ష్మణరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని తాళ్లవలస గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తోలేటి వాసు ఆచారికి చెందిన రేకుల ఇల్లు దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఇల్లు మొత్తం చుట్టుముట్టాయి. క్షణాల వ్యవధిలోనే మొత్తం కాలిపోయాయి. నిత్యావసర వస్తువులు, సరుకులు, ఫ్రిడ్జ్, ఇన్వెర్టర్, గ్యాస్ సిలెండర్, ఫ్యాన్లు మొత్తం దగ్ధమైపోయాయి. ఫైర్ సిబ్బంది కమలాకర్‌నాయుడు, రామలక్ష్మణ్, రాము, పైల అశోక్‌లు మంటలను అదుపుచేశారు. రెవెన్యూ సిబ్బంది రత్నకర్, వీఆర్‌వో గోవిందరావు, బాస్కరరావులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

విశ్రాంత ఉద్యోగికి గాయాలు



గాయపడిన వసంతరావు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ఫరీదుపేట పంచాయతీ కొయ్యరాళ్ల కూడలి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్రాంత బ్యాంకు ఉద్యోగి కోరుకొండ వసంత రావుకి గాయాలయ్యాయి. శ్రీకాకుళం పట్టణం బ్యాంకర్స్ కాలనీకి చెందిన ఈయన చిలకపాలేం వైపు నుంచి శ్రీకాకుళం పట్టణం బైక్‌పై వస్తున్నారు. బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో ముఖం, శరీరంలో ఇతర భాగాలకు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం చేరవేశారు. క్షతగాత్రుడిని శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు.

గిరిజనులకు 80 శాతం రాయితీపై విత్తనాల పంపిణీ



కొత్తూరు వెలుగు అసోసియేషన్ వారు అందించిన విత్తనాల ప్యాకెట్లను చూపిస్తున్న గిరిజనులు

మెళియాపుట్టి: గిరిజనులు అతి తక్కువ పెట్టుబడితో అత్యధిక ఆదాయం పొందేవిధంగా కొత్తూరు వెలుగు అసోసియేషన్ సహకారం అందిస్తుందని పలువురు అసోసియేషన్ సభ్యులు అన్నారు. సోమవారం మండలంలోని గొడ్డగ్రామంలో కేరాసింగి, నేలబొంతు, ఆంజనేయపురం, పాగడవెల్లి, గొడ్డ గ్రామంలో 80శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. గిరిజనుల భూముల్లో పండించడానికి అనువైన కొండచీపుర్లు, చిరుధాన్యాలు, కూరగాయలు పలురకాల విత్తనాలను అందించారు. కేరాసింగి సర్పంచ్ పెద్దబొంతు ఆది లక్ష్మి మాట్లాడుతూ 2018 నుంచి మండలంలోని గిరిజనులకు అవసరమైన విత్తనాలను కొత్తూరు వెలుగు అసోసియేషన్ అందిస్తున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. గిరిజనుల ఆర్థిక పురోభివృద్ధికి ఇలాంటి సహాయ సహకారాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పెదబొంతు అప్పారావు, పలువురు ఏరియా కోర్డినేటర్లు, సీసీ జగన్, మొబలైజర్స్ కళ్యాణి, హరిశ్చంద్ర ఉన్నారు.

'కిడ్నీ వ్యాధులపై పరిశోధన కొనసాగిస్తున్నాం'



ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్‌తో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వివేకానంద

కవిటి: ఉద్దానం ఎండోమిక్ నెఫ్రోపతిపై గతంలో చేపట్టిన పరిశోధనలు కొనసాగిస్తున్నామని నెఫ్రాలజిస్టు, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ పూర్వ అధ్యక్షుడు ప్రొఫెసర్ వివేకానంద ఝా అన్నారు. సోమవారం ఈ మేరకు కవిటి సీహెచ్‌సీలో కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల ప్రభుత్వ వైద్యులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బి.అశోక్‌ను రామయ్యపుట్టుగలోని ఆయన స్వగృహంలో కలిసి ఈ అంశంపై మాట్లాడారు. ఉద్దానం ప్రాంతంలో అంతుచిక్కని కారణాలతో భయాందోళనలు సృష్టిస్తున్న కిడ్నీవ్యాధులపై గతంలో ప్రారంభించిన పరిశోధనలు మళ్లీ విస్తృతం చేయనున్నామని తెలిపారు. ప్రధానపుట్టుగ, శ్రీరాంపురం గ్రామాలను సందర్శించి పరిశోధన కార్యకలాపాలను పరిశీలించారు. జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఇంపీరియల్ కాలేజ్ లండన్ ప్రొఫెసర్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ పూర్వాధ్యక్షుడు ప్రొఫెసర్ వివేకానంద్ ఝా, దీర్ఘకాల కిడ్నీ వ్యాధి (ఐఓఈ) నిర్వహణ, చికిత్సపై వైద్యులకు అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ ప్రాంతంలో ఐఓఈ భారం 21% ఉందని, ఈ వ్యాధి మూలకారణాన్ని కనుగొనడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నట్లు ఆయన వివరించారు. కొలంబియా మెడికల్ సెంటర్, యునైటెడ్ స్టేట్స్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌తో కలిసి నిర్వహిస్తున్న ప్రస్తుత ప్రాజెక్టు గురించి ఆయన సమాచారం ఇచ్చారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత



అక్రమంగా తరలిస్తున్న బియ్యంను పట్టుకొన్న సీఎస్‌డీటీ రవికుమార్, ప్రసన్న

కొత్తూరు: కొత్తూరు మండలం ఆంధ్రా–ఒడిశా సరిహద్దు మాతల చెక్‌పోస్టు వద్ద ఆదివారం స్థానిక సీఎస్‌డీటీ రవికుమార్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నివగాం నుంచి ఒడిశా రాష్ట్రం కాశీనగర్‌కు పికప్ వ్యాన్‌పై అక్రమంగా తరలిస్తున్న 29 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. ఈ బియ్యం నివగాంకు చెందిన ఇప్పిలి అప్పలరాజుకు చెందినదిగా గుర్తించినట్లు సీఎస్‌డీటీ రవికుమార్ తెలిపారు. వ్యాన్‌డ్రైవర్ డి.శివపై కేసు నమోదు చేసి బియ్యంను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఇద్దరు నాయకుల బెదిరింపుపై ఎంపీడీఓ ఫిర్యాదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కొత్తకోట అమ్మి నాయుడు, కొయ్యాం సర్పంచ్ జీరు వెంకటమ్మ భర్త రామారావు తనను బెదిరించి, అసభ్య పదజాలంతో దూషించారని ఎచ్చెర్ల ఎంపీడీఓ రమాదేవి ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు..

ఈ నెల 27వ తేదీన ఎచ్చెర్ల ఎంపీడీఓ కార్యాలయాన్ని ఎచ్చెర్ల శాసన సభ్యులు నడుకుదిటి ఈశ్వర రావు ఆకస్మికంగా తనిఖీ చేసి సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే వెళ్లిపోతుండగా, అమ్మనాయుడు అనే నాయకుడు వచ్చి 'నిన్ను బట్టలు ఊడ దీసి తంతాను' అని బెదిరించారు. దీంతో పాటు సోమవారం మరో ఘటన జరిగింది. అక్కడి సర్పంచ్ భర్త రామారావు తన ఇంటికి పింఛన్లు తీసుకునేవారు రావాలని అంటున్నారని ఫిర్యాదులు అందాయి.

ఈ నేపథ్యంలో గ్రామ కార్యదర్శికి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేయాలని ఎంపీడీఓ సూచించారు. దీంతో రామారావు ఎంపీడీఓను అసభ్య పదజాలంతో దూషించారు. ఎచ్చెర్ల ఎస్ఐ ఎస్.చిరంజీవి మాట్లాడుతూ ఎంపీడీఓ ఫిర్యాదును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు చెప్పారు

'కొత్త చట్టాల అమలు ఆపాలి'



ఆమదాలవలసలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఆమదాలవలస: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాల అమలును నిలిపివేయాలని 'ఐలు' రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహనరావు డిమాండ్ చేసారు. సోమవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్రంగా విస్తృత స్థాయి చర్చ జరపకుండా కొత్త చట్టాలను అమలు చేస్తే సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఈ కొత్త చట్టాలను న్యాయ శాఖ రూపొందించలేదని, హోం శాఖ రూపొందించిందని, దానికి పాలక పక్షం తలూపిందని అన్నారు. ప్రతిపక్షం మొత్తాన్నీ సస్పెండ్ చేసి వాటిని ఆమోదించారని, ఈ చట్టాలను ఇలాగే అమలు చేస్తే న్యాయ సంక్షోభం తప్పదని హెచ్చరించారు. విస్తృతమైన చర్చ జరిగాక అమలు చేయాలన్నారు.

కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు హనుమంతు ప్రసాద రావు, గురుగుబెల్లి ప్రభాకర రావు, గోవిందరాజులు, ఎస్. ప్రసాద రావు, అచ్చెన్నాయుడు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రోటరీ క్లబ్‌కు అవార్డుల పంట



అవార్డులు అందుకుంటున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: సమాజ హితమే మార్గంగా సేవే ధ్యేయంగా పని చేస్తున్న రోటరీ క్లబ్ శ్రీకాకుళంను డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు దత్తా పదహారు అవార్డులతో సత్కరించారు. విజయవాడలో ఆదివారం రాత్రి రోటరీ క్లబ్ సత్కారం అవార్డ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ ప్రెసిడెంట్ గీతాశ్రీకాంత్ మాట్లడుతూ ఇన్ని అవార్డులు అందరి కృషితో సాధించగలిగామని తెలిపారు. రోటరీ క్లబ్ సెక్రటరీ అన్నెపు అనంతరావు మాట్లాడుతూ ఉత్తమ క్లబ్‌గా ప్లాటినం అవార్డు అందుకోవటం ఆనందంగా ఉందని అన్నారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ శివశంకర్ మాట్లాడుతూ బెస్ట్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ గీతాశ్రీకాంత్ ప్లాటినం అవార్డు, బెస్ట్ సెక్రటరీగా అన్నెపు అనంతరావు గోల్డ్ అవార్డు అందుకోవటం ఆనందంగా ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రతినిధులు ఎంఆర్‌కె దాస్, టీజే నాయుడు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.